ఫ్రాన్స్ కొత్త ప్రధానిగా ఫ్రాంకోయిస్ బేరో

ప్రకటించిన అధ్యక్షుడు మాక్రాన్

ప్యారిస్, డిసెంబర్ 13: ఫ్రాన్స్ తదుపరి ప్రధానిగా తన మధ్యేవాద మిత్ర పక్ష సభ్యుడు ఫ్రాంకోయిస్ బేరోను ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్ శుక్రవారం ప్రకటించారు. గత వారం చారిత్రాత్మక అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో గత ప్రభుత్వం కూలిపోయిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎంపిక అనివార్యమైంది. మాక్రాన్ సెంట్రిస్ట్ కూటమిలో కీలక భాగస్వామి అయిన 73 ఏళ్ల బేరో అనేక దశాబ్దాలుగా ఫ్రెంచ్ రాజకీయాలలో మంచి పేరున్న నాయకుడు.యూరోపియన్ పార్లమెంట్ నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొన్న బేరో ఇటీవలే నిర్దోషిగా బయటపడ్డారు.

కన్నడ నటుడు దర్శన్‌కు బెయిల్

బెంగళూరు : కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు కర్ణాటక హైకోర్టు శుక్రవారం బెయిలు మంజూరు చేసింది. ఆయనతోపాటు ఆయన స్నేహితురాలు పవిత్ర గౌడ, మరో ఏడుగురు నిందితులు కూడా బెయిలును పొందారు. రేణుక స్వామి హత్య కేసులో వీరికి ఈ ఉపశమనం లభించింది. పవిత్ర గౌడకు స్వామి అసభ్యకర సందేశాలను పంపించారని నిందితులు ఆరోపిస్తున్నారు. జూన్ 8న స్వామి హత్య జరిగింది. అదే నెల 11న దర్శన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్శన్ ప్రస్తుతం నడుము నొప్పికి దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన నిందితులు జైలులో ఉన్నారు.

వరకట్న, గృహహింస చట్టాలను సమీక్షించాలి

బెంగళూరు టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'సుప్రీం'లో పిల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: బెంగళూరులో 34 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ప్రస్తుత వరకట్న, గృహ హింస చట్టాల దుర్వినియోగాన్ని ఆపేందుకు ఆ చట్టాలను సమీక్షించి, సంస్కరించడానికి ఒక నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ కోవిదులతో కమిటీ ఏర్పాటును న్యాయవాది విశాల్ తివారీ తన పిల్‌లో కోరారు. ఐపీసీలోని 498ఏ సెక్షన్ దుర్వినియోగాన్ని విమర్శిస్తూ గతంలో సుప్రీం కోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలను అమలు చేయాలని అభ్యర్థించారు.

లౌకికవాదం, సామ్యవాదం పదాలను తొలగించాలి

రాజ్యాంగ నిపుణుడు, సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ ప్రవేశిక నుంచి లౌకికవాదం, సామ్యవాదం పదాలను తొలగించాలని రాజ్యాంగ నిపుణుడు, సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే పిలుపునిచ్చారు. ఈ పదాలను దేశంలో ఎమర్జెన్సీ అమల్లో ఉన్న కాలం 1976లో చేర్చారని చెప్పారు. ఈ పదాలను రాజ్యాంగంలో చేర్చడం అనవసరమని తెలిపారు. రాజ్యాంగ నిర్మాతలు తమ దృష్టిని, ధ్యాసను రాజ్యాంగ రచన కోసం అంకితం చేశారని, అన్ని రకాల రాజ్యాంగబద్ధ రక్షణలను పెట్టారని, వారు చేర్చని పదాలైన లౌకికవాదం, సామ్యవాదంలను మీరు ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. అంబేద్కర్, బీఎన్ రావు వంటి ప్రభావశీలురు రాజ్యాంగానికి రూపకల్పన చేశారని, వారికి ఆంగ్లంపై గట్టి పట్టు ఉందని, అయినప్పటికీ, వారు ఈ పదాలను రాజ్యాంగంలో చేర్చలేదని గుర్తు చేశారు.

18 వేల మంది | భారతీయులు వెనక్కి!

జాబితా సిద్ధం చేసిన అమెరికా.. ట్రంప్ అధ్యక్షుడు కాగానే భారత్‌కు పంపించే అవకాశం

వాషింగ్టన్, డిసెంబర్ 13: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల హామీ మేరకు లక్షలాది మంది అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు అమెరికా నుంచి పంపించాల్సిన 15 లక్షల మంది జాబితాను యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) సిద్ధం చేసింది. నవంబర్‌లో విడుదల చేసిన ఈ జాబితాలో 17,940 మంది భారతీయులు ఉన్నారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులను వెనక్కు పంపడానికి అమెరికా చరిత్రలోనే అతి పెద్ద కార్యక్రమాన్ని చేపడతానని ట్రంప్ హామీ ఇచ్చారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ తర్వాత అక్రమ వలసదారులను సొంత దేశాలకు పంపించే చర్యలను అమెరికా ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. కాగా, ప్యూ రిసెర్చ్ సెంటర్ అనే సంస్థ డాటా ప్రకారం అమెరికాలో 7.25 లక్షల మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. అమెరికాలోని అక్రమ వలసదారుల్లో మెక్సికో, ఎల్ సాల్వడర్ దేశాలకు చెందిన వారి తర్వాత భారతీయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 90 వేల మంది భారతీయులు అక్రమంగా అమెరికా సరిహద్దు దాటే ప్రయత్నంలో భద్రతా సిబ్బందికి చిక్కారు.

భారత్‌ను 'సహకరించని దేశం'గా పేర్కొన్న ఐసీఈ

అక్రమ వలసదారులను దేశం నుంచి పంపేందుకు భారతీయ వ్యవస్థల నుంచి ఆలస్యం జరుగుతున్నదని పేర్కొన్న యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ).. భారత్‌ను 'సహకరించని దేశం' విభాగంలో చేర్చింది. అమెరికా నుంచి అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపే క్రమంలో సహకరించని, వారిని దేశంలోకి అనుమతించని దేశాలను ఈ జాబితాలో ఐసీఈ చేరుస్తున్నది. ఇప్పటివరకు భారత్, చైనా, పాకిస్థాన్ సహా 15 దేశాలను ఈ జాబితాలో చేర్చింది.

అందని ద్రాక్షలా హెచ్-1బీ వీసాలు

అమెరికాలో ఉద్యోగం చేసేందుకు ఇతర దేశాలకు చెందిన నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఈ వీసాల కోసం అమెరికాలోని కంపెనీలు ముందుగా పిటిషన్లు పెట్టుకుంటే ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది. గత కొన్నేండ్లుగా భారతీయ ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసా అప్రూవల్స్ తగ్గిపోతున్నాయి. అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడు ప్రముఖ భారతీయ ఐటీ కంపెనీలకు 2015 ఆర్థిక సంవత్సరంలో 14,792 హెచ్-1బీ వీసాలకు ఆమోదం రాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో కేవలం 7,299 మాత్రమే వచ్చాయి. అధికారిక డాటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఇచ్చిన మొత్తం హెచ్-1బీ వీసా అప్రూవల్స్‌లో ఏడు ప్రధాన భారతీయ సంస్థలకు దక్కింది కేవలం 5.2 శాతం మాత్రమే. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తిరస్కరణ శాతం భారీగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. దీంతో హెచ్-1బీ వీసాలు మరిన్ని తగ్గే అవకాశం ఉంది.

తప్పులో కాలేసిన ప్రియాంక

- **హిమాచల్‌ప్రదేశ్ లోని సొంత పార్టీ ప్రభుత్వంపై విమర్శలు**
- **లోక్‌సభలో ఎంపీగా మొదటి ప్రసంగంతోనే అభాసుపాలు**
- **వైరల్‌గా మారిన ప్రియాంకా గాంధీ వ్యాఖ్యలు.. నెటిజన్ల సెటైర్లు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తన మొట్టమొదటి పార్లమెంట్ ప్రసంగంలోనే పెద్ద తప్పులో కాలేశారు. ఏదో మాట్లాడబోయి, ఇంకేదో మాట్లాడి, చివరకు సొంత పార్టీనే ఇరుకున పడేశారు. శుక్రవారం లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రైతులను విస్మరించి బడా వ్యాపారులకు అనుకూలంగా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను ప్రియాంక దుయ్యబట్టారు. అయితే ఆమె సొంత పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వమే హిమాచల్‌లో అధికారంలో ఉందన్న విషయాన్ని ఆమె మరిచిపోవడం విశేషం. ప్రియాంక ప్రసంగిస్తూ దేశంలో రైతులు వరుణదేవుడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని, హిమాచల్‌లో ప్రస్తుతం అమలవుతున్న చట్టాలన్నీ బడా వ్యాపారులకు అనుకూలంగా మాత్రమే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. హిమాచల్‌లో ఆపిల్స్‌ను పండించే చిన్న రైతులకు కన్నీరే మిగులుతోందని, ఒక వ్యక్తి కోసం విధానాలన్నిటినీ మార్చేశారని ఆమె ఆరోపించారు.

నెటిజన్ల సెటైర్లు

ఎంపీగా తన మొదటి ప్రసంగంలోనే ప్రియాంకా గాంధీ తడబాటుకు గురై సొంత ప్రభుత్వాన్నే విమర్శించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'హిమాచల్ ప్రదేశ్‌లో సొంత పార్టీ అధికారంలో ఉందని తెలుసుకోకుండానే ప్రియాంకా గాంధీ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు', 'ఆమె పప్పు కంటే పెద్ద పప్పులా ఉన్నారు' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కాగా, తమ నాయకురాలి మొదటి ప్రసంగంపై కాంగ్రెస్ ఎంపీలు, ఆ పార్టీ నేతలు సైతం ఆసక్తిగా ఎదురుచూడగా, ఆమె సొంత ప్రభుత్వాన్ని విమర్శించడంతో ఉసూరుమన్నారు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభం, వింత పన్నులతో వస్తున్న వ్యతిరేకతతో ఇబ్బంది పడుతున్న హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రియాంక వ్యాఖ్యలతో మరింత ఇరుకునపడింది.

'రాజ్యాంగం'పై వాడీవేడి చర్చ

లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగ 75 ఏండ్ల ప్రయాణంపై లోక్‌సభలో మొదటి రోజు చర్చ వాడీవేడిగా సాగింది. శుక్రవారం రాజ్యాంగంపై చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల పరస్పర విమర్శలతో సభ రెండుసార్లు వాయిదా పడింది. రాజ్యాంగాన్ని ప్రతిపక్ష నేతలు జేబుల్లో పెట్టుకుంటారని, ఇది వారి పూర్వీకుల నుంచి నేర్చుకున్నారని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. బీజేపీ మాత్రం రాజ్యాంగాన్ని ఎప్పుడూ శిరసావహిస్తుందని, వ్యవస్థల స్వతంత్రత, స్వయంప్రతిపత్తితో ఎన్నడూ ఆడుకోలేదని పేర్కొన్నారు. తర్వాత మాట్లాడిన ప్రియాంక గాంధీ.. 'భారత సంవిధాన్' అంటే 'సంఘ్ విధాన్' కాదని ప్రధాని మోదీ అర్థం చేసుకోలేదని ఆరోపించారు.

కెనడాలో వారంలోనే ముగ్గురు

భారత విద్యార్థుల హత్య

అప్రమత్తంగా ఉండాలన్న కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: భారత్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు గత వారం కెనడాలో హత్యకు గురైనట్టు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఒట్టావాలోని భారత హై కమిషన్, టొరంటో, వాంకోవర్‌లోని మన దౌత్య వేత్తలు నిరంతరం బాధిత కుటుంబాలతో సంప్రదింపుల్లో ఉండి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తున్నారని ఆయన తెలిపారు. మృతులలో 20 ఏండ్ల హర్షన్‌దీప్ సింగ్‌ను మాత్రమే గుర్తించారని, మిగిలిన వారిని గుర్తించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కెనడాలో పౌరులు, విద్యార్థుల భద్రత, సంక్షే మం చాలా ముఖ్యమైనదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

జస్టిస్ శేఖర్‌పై అభిశంసన!

రాజ్యసభలో విపక్షాల నోటీస్

న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అభిశంసన తీర్మానం కోసం రాజ్యసభలో విపక్ష పార్టీల ఎంపీలు నోటీసు ఇచ్చారు. శుక్రవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్‌ను కలిసి నోటీసును అందజేశారు. కపిల్ సిబల్, దిగ్విజయ్ సింగ్, సాకేత్ గోఖలే, రాఘవ్ చద్దా సహా 55 మంది ప్రతిపక్ష ఎంపీలు ఈ నోటీసుపై సంతకం చేశారు. న్యాయ మూర్తుల(విచారణ) చట్టం - 1968తో పాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద అభిశంసన తీర్మానానికి నోటీసు అందజేశారు. విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ దేశ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ విద్వేష ప్రసంగం చేశారని, మత సామరస్యాన్ని దెబ్బతీశారని నోటీసులో పేర్కొన్నారు. మైనారిటీలను ఆయన లక్ష్యంగా చేసుకున్నారనేది ప్రాథమికంగా కనిపిస్తున్నదని పొందుపరిచారు.

ఇస్తాంబుల్ విమానాశ్రయంలో చిక్కుకున్న
వందలాది భారతీయులు

ఇండిగో విమాన సర్వీసులలో తీవ్ర జాప్యం

24 గంటలకు పైగా ఎయిర్‌పోర్టులోనే అవస్థలు

ముంబై: ఢిల్లీ, ముంబైకి వెళ్లే విమాన సర్వీసులలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఇస్తాంబుల్ విమానాశ్రయంలో వందలాది మంది ఇండిగో ఎయిర్‌లైన్స్‌కి చెందిన ప్రయాణికులు చిక్కుకుపోయారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో ఎయిర్‌లైన్స్ క్షమాపణ చెప్పింది. అయితే ఆలస్యానికి కారణాన్ని మాత్రం వివరించలేదు. ఢిల్లీ, ముంబై నుంచి ఇస్తాంబుల్‌కు ప్రతి రోజు చెరో బోయింగ్ 777 విమానాన్ని ఇండిగో నడుపుతోంది. విమానాల ఆలస్యానికి కచ్చితమైన కారణాన్ని ఎయిర్‌లైన్స్ ప్రకటించలేదు. అయితే ప్రమాణికులు మాత్రం 24 గంటలకు పైగా జరుగుతున్న ఆలస్యంపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇస్తాంబుల్ విమానాశ్రయంలో సరైన సౌకర్యాలు లేవని, గురువారం నుంచి తామంతా విమానాశ్రయంలోనే చిక్కుకుపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఆహారం లేదు. స్పష్టమైన సమాచారం లేదు. ఏ ప్రతినిధి రాడు. నష్టపరిహారం లేదు. దుర్భరమైన పిరిస్థితి" అని ఓ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్జిలు ఫేస్‌బుక్ వాడొద్దు..

గుర్రంలా పని చేయాలి

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: న్యాయమూర్తులు ఋషి, సన్యాసి మాదిరిగా జీవించాలని, గుర్రాల మాదిరిగా పని చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. న్యాయ సంబంధిత అంశాల్లో వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా సంయమనం పాటించాలని, సామాజిక మాధ్యమాలను వాడవద్దని తెలిపింది. తీర్పులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయవద్దని కోరింది. న్యాయ వ్యవస్థలో తళుకుబెళుకు ఆకర్షణలకు చోటు లేదని వివరించింది. మధ్య ప్రదేశ్‌లో ఇద్దరు మహిళా న్యాయ మూర్తులు తమ ప్రొబేషన్ కాలంలో సంతృప్తికరంగా పని చేయలేదని మధ్య ప్రదేశ్ హైకోర్టు నిర్ధారించింది. ఆ ఇద్దర్నీ పదవి నుంచి తొలగించింది. వీరిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు ప్రత్యేకకార్డులు

ఏటీఎంల నుంచి నేరుగా డబ్బు విత్‌డ్రా

బ్యాంకింగ్ తరహాలో ఈపీఎఫ్ఓ సేవలు

కేంద్ర కార్మిక కార్యదర్శి సుమితా దావ్రా

న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) సభ్యులు త్వరలో తమ ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) డబ్బును సెటిల్‌మెంట్ తర్వాత ఏటీఎంల నుంచి నేరుగా తీసుకోవచ్చు. ప్రస్తుతం (ఈపీఎఫ్ఓ) ఖాతాదారులు ఆన్‌లైన్‌లో తమ క్లెయిముల పరిష్కారానికి 7 నుంచి 10 రోజులు వేచి చూడాల్సి వస్తోంది. సెటిల్‌మెంట్ తర్వాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ అవుతోంది. కొత్తగా అమలు చేయనున్న విధానం ప్రకారం ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు తమ పొదుపు మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు ఏటీఎంలలో ఉపయోగించుకునే విధంగా ఉండే ప్రత్యేక కార్డులు అందజేస్తామని కార్మిక శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తమ 7 కోట్ల మందికి పైగా ఖాతాదారులకు బ్యాంకింగ్ వ్యవస్థకు దీటుగా సేవలను కల్పించాలని ఈపీఎఫ్ఓ యోచిస్తున్నట్లు చెప్పారు. ఐటీ మౌలిక సదుపాయాల అభివృద్ధి పైనే ప్రస్తుతం ఈపీఎఫ్ఓ దృష్టి పెట్టినట్లు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. ఈపీఎఫ్ఓ వ్యవస్థను బ్యాంకింగ్ వ్యవస్థతో సమానంగా తీర్చిదిద్దుతామని ఆమె తెలిపారు. కొత్త విధానం కింద క్లెయిమ్ దారులు, లబ్ధిదారులు లేదా బీమా పొందిన వ్యక్తులు ఏటీఎంల ద్వారా తమ డబ్బును తీసుకోవచ్చని ఆమె చెప్పారు. మరణించిన ఖాతాదారుల వారసులకు ఈడీఎల్ఐ పథకం కింద గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు సమకూరుస్తామని ఆమె వివరించారు. కొత్త విధానంలో మరణించిన ఈపీఎఫ్ఓ ఖాతాదారుని వారసులు కూడా సెటిల్‌మెంట్ డబ్బును ఏటీఎంల ద్వారా తీసుకోవచ్చని చెప్పారు.

ఫోర్బ్స్ జాబితాలో ముగ్గురు భారతీయ మహిళలు

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన మహిళల 21వ వార్షిక జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. అందులో తమ తమ రంగాల్లో విశేష ప్రతిభను చూపిన ముగ్గురు భారతీయ మహిళలకు స్థానం లభించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ (28వ ర్యాంక్), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సీఈవో రోషిణీ నాడార్ మల్హోత్రా (81వ ర్యాంక్), భారత్‌లో వ్యక్తిగతంగా అత్యంత సంపన్నురాలిగా నిలిచిన కిరణ్ మజుందార్ షా (91వ ర్యాంక్)లు ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, వినోదం, రాజకీయాలు, దాతృత్వం, విధాన రూపకల్పన ఇలా పలు రంగాలలో తమ ప్రతిభతో ప్రభావవంతంగా నిలిచిన మహిళలను ప్రతి ఏడాది ఎన్నిక చేసి ఫోర్బ్స్ జాబితా విడుదల చేస్తుంది.

గాంధేయ మార్గంలోనే ఆందోళన చేయండి

రైతులకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: సరిహద్దు వద్ద నిరసనకు దిగిన రైతులు హింసాత్మక చర్యలకు దిగకుండా గాంధేయ మార్గాన్ని అనుసరించాలని సుప్రీంకోర్టు కోరింది. రైతుల డిమాండ్ల సాధనకు 17 రోజులుగా దీక్ష చేస్తున్న జగ్జీత్ దల్లేవాల్‌కు తక్షణం వైద్య సహాయం అందించాలని కేంద్రం, పంజాబ్ ప్రభుత్వాలను ఆదేశించింది. పంజాబ్-హర్యానా సరిహద్దు వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ వద్దకు ప్రభుత్వ ప్రతినిధులను పంపించాలని జస్టిస్‌లు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అతనికి వైద్య సహాయం అందించాలని, నిరాహార దీక్ష కారణంగా అతని ప్రాణాలకు ముప్పు ఉన్నందున దీక్ష విరమణకు ఒప్పించాలని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో అతడిని బలవంతం చేయకుండా ఒప్పించాలని సూచించింది. సుప్రీం కోర్టు ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసిందని, ఆందోళన చేస్తున్న రైతులతో అది చర్చించి, తన సిఫార్సులను న్యాయస్థానానికి అందజేస్తుందని, దానిని తాము ప్రభుత్వం ముందు ఉంచుతామని న్యాయస్థానం తెలిపింది. రైతులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించింది.

'ఉపాధి' వేతనం ఇంత తక్కువా?

- **వివిధ రాష్ట్రాల్లో వ్యత్యాసాలెందుకు?**
- **ఉపాధి హామీలో పని దినాలను 150 రోజులకు పెంచండి**
- **పార్లమెంటరీ ప్యానెల్ కీలక సూచనలు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తక్కువ వేతనాలు ఇవ్వడంపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పథకం కింద ఇస్తున్న వేతనాలను ద్రవ్యోల్బణం సూచికను దృష్టిలో పెట్టుకొని ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించింది. వేతనాలను పెంచేందుకు ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను కోరింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానెల్ సమర్పించిన నివేదికను కేంద్రం గురువారం లోక్‌సభ ముందు ఉంచింది. ఉపాధి హామీ పథకంలో వేతనాల సవరణకు సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిసారి ఒకే విధమైన సమాధానం ఇస్తోందని ప్యానెల్ అసంతృప్తి వ్యక్తం చేసింది. 'పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని చోట్ల ధరలు, జీవన వ్యయం పెరగడం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇలాంటి సమయంలోనూ చాలా రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో ఇచ్చే రోజువారీ కూలీ రూ.200 అటు ఇటుగా ఉంది. ఆయా రాష్ట్రాల్లో ఇతర కూలీ రేట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ తర్కాన్ని అవి ఎలా ధిక్కరిస్తాయి?' అని ప్యానెల్ ప్రశ్నించింది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉపాధి హామీ వేతనాలను సవరించాలని సూచించింది. ఈ పథకంలో అందిస్తున్న వేతనాలు వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉండటం మరొక ఆందోళనకర అంశమని తెలిపింది. రాజ్యాంగంలోని 39వ అధికరణ ప్రకారం ఎలాంటి వివక్ష లేకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సమాన వేతనం చెల్లించాలని పేర్కొంది. ఈ పథకంలో కనీస పని దినాలను 100 నుంచి 150 రోజులకు పెంచాలని ప్యానెల్ ప్రతిపాదించింది.

ఉక్రెయిన్‌పై క్రూయిజ్ క్షిపణులతో రష్యా దాడి

విద్యుత్తు వ్యవస్థ ధ్వంసమే లక్ష్యం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ దాడికి పాల్పడింది. రాజధాని కీవ్‌తో పాటు పలు ప్రాంతాలపై డజన్ల కొద్దీ క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దండెత్తింది. ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా విద్యుత్తు వ్యవస్థ లక్ష్యంగా శుక్రవారం విరుచుకుపడింది. 93 క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులు, 200 డ్రోన్లతో రష్యా దాడులు చేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా దురాక్రమణ ప్రారంభమైన మూడేండ్ల తర్వాత తమ దేశ విద్యుత్తు వ్యవస్థపై జరిపిన అతిపెద్ద దాడిగా ఆయన పేర్కొన్నారు. అయితే తమ రక్షణ వ్యవస్థలో ఉన్న ఎఫ్-16 విమానాల ద్వారా 11 క్రూయిజ్ సహా 81 క్షిపణులను నేలకూల్చినట్టు చెప్పారు. రష్యా దాడులపై ప్రపంచ దేశాలు తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఉందని, ఉగ్రవాదాన్ని ఆపడానికి ఇదొక్కటే మార్గమని అన్నారు.

డిస్కంల ప్రైవేటీకరణపై ఏఐపీఈఎఫ్ ఆందోళన

దేశవ్యాప్తంగా 27 లక్షల మంది ఇంజినీర్ల నిరసన

న్యూఢిల్లీ: యూపీలో రెండు డిస్కంలను ప్రైవేటీకరణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ అఖిల భారత విద్యుత్తు ఇంజినీర్ల సమాఖ్య (ఏఐపీఈఎఫ్) శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. పూర్వాంచల్ విద్యుత్తు వితరణ్ నిగమ్ లిమిటెడ్ (పీవీవీఎన్ఎల్), దక్షిణాంచల్ విద్యుత్తు నిగమ్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ (డీవీవీఎన్ఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ఆందోళనల్లో ఏఐపీఈఎఫ్‌కు చెందిన దాదాపు 27 లక్షల మంది సభ్యులు పాల్గొన్నట్టు ఆ సమాఖ్య చైర్మన్ శైలేంద్ర దూబే వెల్లడించారు. లక్నో, వారణాసి, ఆగ్రా, చండీగఢ్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరువనంతపురం, విజయవాడ, గువాహటి, నాగ్‌పూర్, రాయ్‌పూర్, జబల్పూర్, భోపాల్, సిమ్లా, జమ్ము, శ్రీనగర్, డెహ్రాడూన్, పటియాలా, రాంచీ తదితర ప్రాంతాల్లో ఈ నిరసన కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. డిస్కంల ప్రైవేటీకరణను ఆపేవరకు నిరసనలను కొనసాగిస్తామని దూబే స్పష్టం చేశారు.

క్రీమ్ లాంటి వ్యాక్సిన్!

- **సూది ఉండదు.. నొప్పి తెలియదు**
- **చర్మం పైన రాసుకుంటే చాలు**
- **అభివృద్ధి చేసిన అమెరికా శాస్త్రవేత్తలు**

న్యూయార్క్, డిసెంబర్ 13: సూది అవసరం లేని, క్రీమ్‌లా రాసుకునే సరికొత్త వ్యాక్సిన్ విధానాన్ని అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వ్యాధులు సోకకుండా నివారించడానికి వేసే వ్యాక్సిన్‌ల వల్ల సాధారణంగా నొప్పి, జ్వరం వంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. ఈ కొత్త విధానం ద్వారా ఇలాంటి సైడ్ ఎఫెక్ట్స్ దాదాపుగా ఉండవని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. స్టఫిలోకాకస్ ఎపిడెర్మిడిస్ వంటి సాధారణ చర్మ బ్యాక్టీరియా ఆధారంగా వ్యాక్సిన్‌లను శరీరానికి ఇవ్వొచ్చని వీరు ప్రతిపాదిస్తున్నారు. శాస్త్రవేత్తలు ఈ బ్యాక్టీరియాను మాడిఫై చేసి ధనుర్వాతానికి కారణమయ్యే రసాయనంతో కల